శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము 3.] రాజమహేంద్రవరము: [సంచిక ౬.
విజయసంవత్సర మార్గశిరమాసము.

ఆంధ్రభాషాభిరంజనీ సమాజము.

ఆ॥ ౧౮౯౩ సంవత్సరము నవంబరు నెల ౨౦ తేది సోమవారము ౫-౧౫ గంటలకు, పైసమాజముయొక్క యారవసంవత్సరోత్సవము మదరాసు క్రైస్తవ కళాశాలయొక్క హాలునందు జరగెను. ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగారగు మ. రా. రా. శ్రీ. సి. జి. కుప్పుసామయ్యగారు అగ్రాసనమును గైకొనఁగా నీక్రిందఁ జేర్కొనఁబడి యుండు పండితోత్తములును, ఇంకను అనేకులును సభకు విచ్చేసి యుండిరి.—

ది. హానరేబిల్. రెవరెండ్ డాక్టరు. మిల్లరు దొరవారు. ఎం. ఏ.;
సి. ఐ. ఇ.

రెవరెండు. జార్జి. పిటెండ్రిగ్ దొరవారు. ఎం. ఏ.

ఇట్టి. కురియన్ దొరగారు బి. ఏ.

మ. రా. రా. శ్రీ. సమర్థ రంగయ్య సెట్టిగారు బి. ఏ.

,, కొక్కొండ వేంకటరత్నము పంతులవారు.

,, ఆర్. శివశంకరపాండ్యాజిగారు. బి. ఏ.

,, పి. సింగారవేలు మొదలియార్ అవర్గల్. బి. ఏ.

,, సమర్థ రామానుజము సెట్టిగారు. ఎం. ఏ. బి. ఎల్.

,, పి. నాగభూషణముగారు. ఎం. ఏ.

,, ఎస్. పూర్ణప్రజ్ఞ రావుగారు. ఎం. ఏ.

,, పానుగంటి రామారాయనింవారు. బి. ఏ.

,, ,, పార్థసారథినాయనింవారు.

అగ్రాసనాధిపతిగారి యుపోద్ఘాత ప్రసంగమునకు పిదప కార్యదర్శియగు కే. చెంగయ్యగారు ఏతత్సమాజముయొక్క యారవ సంవత్సర వృత్తాంతమును చదివిరి. తరువాత సభ్యులలో నొకరు సమాజముమీఁద వ్రాసియుండిన పద్యములు చదువఁబడెను. మ. రా. రా. శ్రీ. ఎస్. పూర్ణప్రజ్ఞరావు ఎం ఏ గారు నాటివిషయమగు "దేశభాషలనుచదువుట" (The study of Vernaculars) అను విషయమునుగురించి యుపన్యసించఁగా, నీవిషయమయి మ. రా. రా. శ్రీ. కొక్కొండ వేంకట రత్నము పంతులవారును ఆర్. శివశంకరపాండ్యాజీ. బి. ఏ. గారును కొంతతడవు సభ్యులకు మిగుల యుత్సాహము కలుగునట్లు మాటాడిరి. అగ్రాసనాధిపతిగారీవిషయమయి మరల కొంతకాలము ప్రసంగించినతరువాత అగ్రాసనాధిపతిగారికిని, ఉపన్యాసకులకును, సమాజమునకు విచ్చేసియుండిన పండితోత్తములకును వందనములతో సభ ముగిసెను.

MADRAS CHRISTIAN COLLEGE.

ANDRABHASHABHIRANJANI.

SIXTH ANNIVERSARY.

తే॥ సకల సుకళాభివృద్ధికై సంభవించి
శక్తిసంపదఁ దగవిని యుక్తిఁ జేసి
సుఖము చెందెడు మిల్లరు సుజనకీర్తి
సోము నెదురనై తేటగఁ జూపుఁ దెపుడు॥

చ॥ పరమకళాధురంధరుఁడు భవ్యుఁడు రంగయ పెంచుచుండఁగన్
గరము వివేకవిస్ఫురణఁ గాంచిన వేంకటరాయశాస్త్రులున్
వరగురుమూర్తిశాస్త్రులును బ్రస్తుతశక్తులనంతరాయలున్
సరసయ శాస్త్రులుం బ్రతిదినంబును గమ్మనిపాలు వోయఁగన్॥

ఆ॥వె॥ ఆంధ్రభాష యిచట నాంధ్రభాషాభిరం
జనియనంగఁ బేర్మి జననమొంది
బాలయగుచుఁ బెరిగె వర్షంబులాఱింట
దీవనల్సతంబు దీనికిండు॥

ఉత్సా॥ తల్లిదండ్రిదోడు పెల్లఁదలఁపఁగీర్తిఁ బెంపఁగం
గల్లగాక రంగుమోము కస్తురితిలకంబుతో

ఘల్లుఘల్లుమనఁగఁ గాళ్ళఁగజ్జెలందెల్లచో
నొల్లెనాట్యకొంగు బాఅనాఅప్రచూపుచుండుతఱిన్॥
చ॥ సరసగుణాభిరాముఁడును సజ్జనవర్యుఁడు కార్యదక్షుఁడున్
కర మనురాగ భక్తులను గార్యవిమర్శనఁ జేయుచుండఁగా
నరిగెను వర్షమొక్కటి మహాప్రమదంబునఁ గాన నెల్లరున్
సరసతఁ జెంగయాఖ్యునకు సఖ్యత వందన మాచరింపరే॥

T. BHAGAVANTHAM,
A Member.

MADRAS CHRISTIAN COLLEGE.

ANDRABHASHABHIRANJANI.

TO

THE HON. AND REV. WILLIAM MILLER.
C. I. E., M. A., L. L. D.

కం॥ శ్రీమంతుఁడై, సకలవి
ద్యామయుఁడై, సర్వదేవతారూపుండౌ,
భూమాన్వితుఁ, డీమిల్లరు
ధీమంతుని, వెలయఁజేయు, ధృతిబహుకళలన్॥
ఉ॥ శారదమూర్తివంచు, సువిశాలయశః పరిపూర్తివంచు, సం
సార మహాపయోధి నిజశక్తిఁ దరించితివంచు, సత్కళా
ఛారవిచార సంకలిత భాసుర బుద్ధిమెలంగితంచు, నిం
పారఁగఁ జాటుచుంద్రు, నిను, నార్యులు, విశ్రుత మిల్లరుప్రభూ!
సీ॥ ఏవానివిద్యానుభావ దీధితులచే, బాలమన స్తమః పటలమడఁగె
ఏవానిబోధనా హీనభాషణలచే, విద్యార్థులకుబుద్ధి వృద్ధిమయ్యె
ఏవానిగుణకదంబ వర్తిపవనంబు, భాషాభిమానుల కైనవీచె
ఏవానిపృథుస్థైర్య హితసత్వమహిమచే, బాలానురంజన ప్రభవెలింగె.
తే॥ నట్టి పరహితతత్పరు, ననఘచరితు,
నార్యసమ్మతు, శ్రితదేవతాగము, నిను,

పొసఁగఁగా సెట్టివారికిఁ బొగడఁదరమె
మిల్లరు ప్రభువర్య, నీమేల్మి కెనఁగ॥
తే॥ 'దేశభాషలయందెల్లఁ దెనుఁగు లెస్స'
యనెడు నార్యోక్తి నిజమగునట్లుగాఁగ
ఆంధ్రభాషాభిరంజని యచ్చర, మాకు
భవనమిచ్చినమిల్లరు ప్రభువలరుత॥
ఉ॥ భూమయుఖిక జగంబులను, పొల్పుగరక్షయొనర్పఁగోరుచున్
నేమముతోడవానిఁదగ నిర్మితిచేసి, విహీననామఁడై
ప్రేమదలిర్పఁ బ్రోచెడు గరిష్ఠుఁడు, నిత్యుఁడనంతుఁడెప్పుడున్
శ్రీ మెరయంగ మిల్లరును జేకొనిగాచుచు నుండుగావుతన్.

VELLORE VASANTHA ROW,
A Member.

ప్ర చు ర ప త్రి క.

ఆంధ్రిశారీరకము— తెలుఁగు అద్వైతభాష్యము; తెలుఁగు పద్య తాత్పర్య సహితంబుగ, మృదు మధురశైలితో, ముముక్షు జనోపయుక్తంబుగ, మదరాసు యూని వర్సిటీ స్కూల్లో అయిన, రాయబహద్దర్ వల్లూరి- జగన్నాథరావు పంతులవారిచే రచి యింపఁబడినది.

మొదటి రెండధ్యాయములు కలికోతోను కిత్తనారతోను చేసుగిల్టు అక్షరముల తోను గట్టిగాను అందముగాను కట్టఁబడినది.

దీనివెల రూ. ౩-౦-౦.

తపాలకర్చు పైగా ఇచ్చుకొనవలెను.

ఈగ్రంథము వలయువారలు, క్రిందనుదాహరింపఁబడిన వారికి వ్రాసి తెప్పించు కొనవచ్చును:—

౧. చెంగల్వల జగన్నాథము పంతులుగారు,
స్టూడెంటు రాజమండ్రికాలేజీ, ఇన్నీసుపేట - రాజమండ్రి.

౨. మంగిపూడి సూరయ్యగారు,
రాయబహద్దర్ వల్లూరి - జగన్నాథరావుపంతులుగారి యింట్లో
కంబము - కర్నూల్ డిస్ట్రిక్టు.

౩. కొప్పారమ్ కృష్ణస్వామిసెట్టిగారు,
నెంబరు. ౭౧ ౧౨. చీనాబజారువీధి, మదారాసు.

శవవహనము.

లోకములో భగవంతునిచే సృజింపఁబడిన భూతకోటిలో క్రూర స్వభావముగల సింహశార్దూలాది ఘాతుకమృగములు దక్క, తక్కిన జీవములన్నియును సామాన్యముగ సంఘనివాసము నాసించునవిగానే యున్నవి. అందువలననే విస్తారసంఖ్యలుగా కూనలనీను పులిపిల్లలు ప్రవృద్ధినొందక, ఒక్కొక్క దూడనీను ఆవులు మొదలగునవి మందలు మందలుగా నుండుట మనము చూచుచున్నారము. ఇట్టి యభివృద్ధికి కారణమును మన మాలోచింపవలసిన యావశ్యక మంతగా కనఁబడదు. గోవులు లోనగు జంతువులు ప్రత్యేకముగానుండి మేత మేయునప్పటికంటె మందలుగానుండి బయళ్లలో మేయునప్పుడే యుల్లాసముగలిగి గంతులు వేయుచు, మూతి నాకుచు అంభారవములు సేయుచు తమ యజమానులకును, చూపఱకును పరమసంతోషము నిచ్చుచు నేత్రపర్వముగా వింపుచుండును. సింహాది క్రూరసత్వములో రెండవవాని కంటఁబడక నాల్గక క్రముచ్చులవలె డాగి సంచరించుచు, తమ కెరయగు జంతువులు దొరకునంతదాక తప్పించుకొని తిరుగుచు, నేకాకులవలె కాలము గడపుకొనును. అట్టి జంతువుల కపాయము సంభవించినను వానిలో నవి ప్రసగ్గి కడతేరవలసినదే గాని రెండవమృగము వానికంటఁబడుట యరుదుగదా. కర్మము చాలక వేరొక సింహము చాయలనుండి పోవుట సంభవించినను రెంటికి నను రాగముండుట కలలోని వార్తయే. గోవులు మొదలగునవి గాయములు వ్యాధులు మొదలగు వానిచే బాధపడుచున్నప్పుడు వానివలన మనకుగల యుపయోగమును బట్టి వానిబాధ యుపశమిల్లుటకు మనము మందుల మాకులనుపయోగించి వాని బాధ మాన్పుటకుఁ బ్రయత్నింతుము. పశువులు కొన్నివేళల తమకుఁదామ సహాయము చేసికొనుట మనము చూచుచుంటిమి. ఒక మందలోని యెద్దులపైన వేఱొక మందలోని యెద్దులు పోరాడుటకు వచ్చినప్పుడు యన్నియుఁ గలసి పోరాడి తమ్ము కాపాడుకొనుచుండును. తన లేదూడకు గాయములు దగిలి పుండ్లచే బాధ పడుచున్నప్పుడు తల్లిగోవు తనవత్సము బాధయుపశమిల్లుటకు గరిగరిగానుండు తన నాలుకతో నాకి దూడకుపశమనము కలిగించును. నోరులేని జీవములన్నియు నీపగిది తమ శక్తికొలది నొండొంటికి తోడ్పడి సహవాస సుఖములను కష్టములను సమముగా ననుభవింపుచుండును. మనుష్యులకుఁగల బుద్ధిజ్ఞానము, అవయవ ప్రయోజనము లేనందున వానికి మనకు పెక్కుమడుంగులు తారతమ్యము గన్పట్టుచున్నను, కొంతవరకు పశుపక్ష్యాది జీవములకును మనుష్యులకును చేష్టలయందు పోలిక యచుర యున్నది. మనుష్యులకు గాని పశువులకుగాని సుఖకాలమున నితరుల యవసరము విస్తా

రముగా కనఁబడకున్నను కష్టకాలమున నందఱితోడ పనికలిగియుండును. అందువల్లనే భగవంతుఁడు భూత ప్రపంచమున పరోపకారకరములగు జీవులను సముదాయనివాస యోగ్యములనుగాను, అపకార భూతములగువాని నొంటరిగా నివసించు నటుల సృజించియున్నాఁడు. ప్రతిజీవమునకు నీతనూయాత్ర చెల్లించుటలో వచ్చు కష్టములకు మేరయుండదు. కష్టసుఖములు సమభాగములుగా నుండునని చెప్పువార్త యెంతవరకు నిజమో నేనెఱుంగకున్నాను. పుట్టిననాటనుండి తనకు గాకున్న తనరక్తస్పర్శగలనీయున్న వారితోలేక ప్రాణసములైన మిత్రులతో, లేక తన యాప్తులతో తరుచుగా చిక్కులు సంభవించుట నిత్యము మనము కనిపెట్టుచునే యున్నారము. ఈకష్టములన్నియు నొకదానిబోలి మఱియొకటి యుండనేరవు. ధనహాని మానహాని శరీరవ్యాధి మనస్తాపము లోనగునవి కొన్నివేళల భోక్తనే బాధింపవు. ఒక్క వంశమున తండ్రియుదుర్మార్గుఁడై యొకనేరము గావించిన నాతనికి జరుగు పరాభవము మాటయటుండగా, ఆతని దోషఫలము కుటుంబము నంతను బాధించి, తరువాత వారినికూడ విపత్తుల పాలుచేయుటను అట్టివాని వంశీకులు ధనహాని మానహాని మనస్తాపములకు గురియగుట యెవ్వరెఱుంగని విషయము. ఒక్కని లోపమువలన కులమునకంతకు తీరని దుఃఖము కలుగుటయథార్థము. ఈకష్టములు మరల రెండు విధములుగ నుండును. వీనిలో కొన్ని స్వయంకృతాపరాధములు కొన్ని యారోపితములు. రెంటివలనకూడ చెడిన కుటుంబము లసంఖ్యాకములుగానున్నవి. కష్టములు వచ్చినవేళ నితరులకు తోడ్పడి శక్తికొలఁది సాహాయ్య మొనరించుట మానవ కోటికి నైజమైయున్నందున రెండు సమయములందునుకూడ మనము చేయూతనిచ్చి యాపన్నివారణముఁ జేయుటకు సమకట్టుదుము. ఇంతవరకు చెప్పిన కష్టములు మనుష్యప్రయత్నములవలన చక్కపరచుకొన దగినవి. కష్టములలో నెల్ల నుత్కృష్టమైనది యు, ధనాధికులు, అధికార ధూర్వహులు, రాజాధిరాజులు,తపోధనులు చేరికొండల తలక్రిందు చేసినను మరలింపరానిదియునగు కష్టము ప్రాణహానివలన కుటుంబములకు గలుగు నష్టము. ఎంతధనికుఁడైనను, ఎందరుమిత్రులున్నను, ఎంతవిరివిగా వ్యాపారముల జరిగించుచున్నను, ఎన్ని సత్పాత్రదానములు చేసినను, ఎన్ని సత్రముల సమారాధనల నిలిపినను, ఎందరిని పలువిధముల కాపాడినను, తప్పనిది మరణ మొక్కటియే కనబడుచున్నది. సాధనాంతరములచే దారిద్ర్య దుఃఖమును బోగొట్టుకొనవచ్చును. ప్రార్థనాదులచే నధికారుల యనుగ్రహమును సంపాదించుకొని శిక్షలకు గురిగాకుండ బయటుపడవచ్చును. మాయోపాయములవన్ని యొకనిని ప్రభువును మఱియొకనిని జోగిని చేయవచ్చును, మృత్యుముఖగతుఁడైనవానిక్షణమయినను కాపాడజాలము గదా.

కావుననే కుటుంబములకుఁ గలుగు కష్టములలో మరణముకన్న నెక్కుడు మరియొక్కటి లేదని చెప్పవలసివచ్చుచున్నది. ఒక్కొక పురుషుఁడు కడతేరినచో తన దారపుత్రులుమాత్రమే గాక దేశమంతయు దుఃఖించి, యాతని కుటుంబమునకంటెను వేయిరెట్లు దేశమంతయు బాధపడవలసివచ్చును. న్యాయైకశీలుఁడైన యగ్బరు చక్రవర్తి వంటివాఁడుగాని, మార్కసు ఆరూలియసు వంటివాఁడుగాని మృతినొందినప్పుడు హిందూ మహారాష్ట్రము, రోమక రాజ్యము పూర్ణముగా దుఃఖవారిధిని మునిఁగియుండెను. అట్టిరాజులు చక్రవర్తులు కాలవశము నొందినను, వారివంశీకులు సమర్థులై వారు లేని లోపమును కనుపడ నీయరైరి. సాధారణ కుటుంబములలో యజమానుని మరణము కుటుంబమును తిరిగి తలయెత్తుకొనకుండ జేసి వారల జీవమాత్రావశిష్టులజేయును. అట్టికుటుంబముల నట్టికష్టసమయమున కనిపెట్టి కాపాడిన, వారు మరల వృద్ధిబొందుటకు హేతువగును. గృహమునకు నాథుడైనవాడు మృతినొంది విపదంబుధి నీదులాడుచున్న వారికి మనము చేయవలసిన సాహాయ్యమెట్టిదో బుద్ధిమతాంవరిష్ఠులైన మీవంటి సభికులముందు నేను వక్కాణింపవలసినపని లేకున్నను, దాని విషయమై కొంతవరకు ప్రశంసింపదలచినందున మీయనుజ్ఞగొని యికదానిగురించి మాటాడుదును.

మనమీప్రపంచమున మిత్రుల సంపాదించుకొనుటలో ముఖ్యోద్దేశము వారు మనకు సుఖదుఃఖములకు తోడ్పడి భాగివేయులై యుండవలెననితప్ప కారణాంతరమూహింపఁజాలకున్నాను. పరోపకారము చేయుట ప్రతిమానవునకును విధాయకమని శాస్త్రములు ఘోషించుచున్నవి. ఈపరోపకారమును కొందరుమాత్రమే చేయవలయుననిన్ని, కొన్నికొన్ని లక్షణములు గలవారుమాత్రమే చేయనర్హులని యెక్కడను విధింపఁబడి యుండలేదు. ప్రతిమానవునివల్లను లోకమునకు తగుమాత్రము ప్రయోజనమున్నది గాని లేకపోలేదు. బలశాలులు, దుర్బలులు, సుఖులు, రోగపీడితులు, పుట్టంధులు, వికలాంగులు సమముగా ప్రయోజనకారులు. గ్రుడ్డివానిచేతికి దీపమునిచ్చిన వానివీపుపైనెక్కి వానికి దారిచూపుచు గమ్యస్థానమును పొందిన కుంటివాని కథను మనము మూడవతరగతిలో చదివి యుంటిమి. వారొండొరులకు సహకారులు గాకుండిన నిద్దరు నీప్సితార్థసిద్ధి బొందనేరకుందురు. ఈప్రకారమన్నియవస్థలలోను ప్రతిమానవుఁడు నితరులకు నుపకారిగా నుండుటకే నిర్దేశింపఁ బడియున్న విషయము నెఱుగక భగవదుద్దేశమునకువిరుద్ధముగా సంచరించుచున్న మానవకోటియొక్క దుస్థితి నేమనిచెప్పవచ్చును. భగవత్సంకల్పము చొప్పున మనము నడచుచుంటిమేని మనకిన్నికష్టములుండవలసిన యవసరము కన్పట్టదు. ఇట్లునుటవలన మనలో నొకరికొకరు

సహాయము చేసికొనకున్నారని నాయభిప్రాయముకాదు. మనమందరము సుఖముగా నున్నప్పుడు మన యిండ్లలో జరుగు శుభశోభనములలో పప్పు దప్పళము లారగించువారును, మనమున్నతదశలో నున్నప్పుడు మన యనుగ్రహము నపేక్షించి పిలువని పేరంటమునకు వచ్చువారును, స్వప్రయోజనపరులై లేనిస్నేహము నభినయించుచు నన్ని పనులకు సమకట్టువారును నుపకారు లనిపించుకొనుటకు తగరని నాయభిప్రాయము. కష్టములలోనెల్ల నుత్కృష్టకష్టమైనమరణకాలమున తరింపశక్యముగాని దుఃఖములకు పాల్పడియున్నవారి నూరార్చి యాదరించినస్నేహమే స్నేహము. అట్టి సహాయమే సాహాయము. దానిగురించియే నేను నేడుచ్చటించదలచిన విషయము. అట్టి సర్వోత్తమమైన సహాయమును మరచి కల్లసహాయముల కుప్పొంగుచు, లోకుల భ్రమింపజేసి మెప్పొందుచున్నవారి ప్రజ్ఞల నేమనిచెప్పుదును! తండ్రిని దుమ్ముచేసిన పుత్రుండే పుత్రుండని కష్టకాలమున అక్కరకు వచ్చినచుట్టమే చుట్టమని మనలో ననుకొను మాటయొక్క వాస్తవము నిర్వివాదాంశము. తండ్రిని మంటగలుపుపుత్రులు పెక్కండ్రు గలరుగాని కష్టకాలమున తోడ్పడిన చుట్టములు స్నేహితులు క్వచిత్తుగా కనంబడుచుందురు. వర్ణములలోనెల్ల నగ్రవర్ణమై, బ్రహ్మముఖమున బుట్టితిమని యుప్పొంగుచు, భరతఖండమున నిరంకుశాధికారముగ వేలకొలది సంవత్సరముల నుండి మతవిషయకపాలకులుగా నుండి, సకల ధర్మశాస్త్రములను, సత్ప్రబంధములను నీతిశాస్త్రముల నొసంగిన వారివంశీకులై ప్రస్తుతమున మనుష్య ధర్మములైన దయాదాక్షిణ్యముల శూన్యులైన బ్రాహ్మణుల దౌష్ట్యములలో నొక్కవిషయమున నేను ప్రశంసింప బూనుకొంటిని. ఆవిషయమే శవవహన విషయము. పరోప కారార్థమిదం శరీరమ్మని బోధించు వాక్యమెంతవరకు మనయందు వాస్తవముగ నున్నదో మీమనసులకే తెలియును. ఇట్లనుటవలన పరోపకారశీలు రీదేశమున లేరని నాయభిప్రాయముకాదు. పరోపకారము వేయివిధములనున్నది. ఆపద్బాంధవులగు పరోపకారులమాట నామనసునందుంచుకొని మాటాడుచుంటిని. సమస్త సమయములయందు నిరుగుపొరుగులవారు కొద్దిగొప్ప తోడ్పడకున్న మనమే కార్యములను నిర్వహింప జాలముకాని యేమిపాపకర్మమో ప్రస్తుతమున కొంచెము పట్టణము లనదగిన స్థలములయందు విపత్తులోనున్న వారిని కనిపెట్టుదమను నూహ మచ్చుమాసినది. అవసానదశలోనున్న వారికి చేయూతనిచ్చి వాని కుటుంబమును కనిపెట్టి తత్సమయమునచేయు సాహాయ్యమే సాహాయ్యము. అదియే పుణ్యకార్యము. ఒక్క ధనికుండు చనిపోవ సిద్ధముగానున్నప్పు డెక్కడలేని బందుగులును స్నేహితులును కుప్ప తిప్పలుగా పోగగుదురు.

——

256 (సశేషము.) దుగ్గిరాల- సూర్యప్రకాశరావు.

శవవహనము (౨౫౬-పుట శేషము.)

వారందఱక్కడ చేరుటకుఁగల కారణము మీరందఱు నెఱుగుదురు. మరణకాలమున వాఁడు వ్రాయించు మరణశాసనమున తమకేదయిన నేర్పాటు చేయునను నాశతోడను, వాని పోష్యవర్గములోనివారై యుండుటచేత ప్రాణములు గుటుక్కుమనునంత రాకుండిన విశ్వాసహీనుఁడని లోకులు దూషింతురను భయముచేతను, కొందరు వాస్తవమయిన ప్రేమచేతను, ఆ సమయమునకు చేరుకొందురు. వారందఱు నేకారణముచేత చేరుదురో నాకు ప్రసక్తి లేదు. ఈ దినమున నేను ప్రకటింపవలసినదంతయు ప్రాణము గుటుక్కుమనిన పిమ్మట శవము నావలకు తరలించు విషయమునుగురించియే కాన నీ లోకాభి రామాయణమునింతటితో గట్టిపెట్టెదను.

మనలో, పలుజాతులును పెక్కు తెగలునుండుటచే, ఆయా మతనిర్బంధముల చొప్పున ప్రేతము నన్నిజాతులవారు తాకుటకు వలను లేదు. అద్వైతులు విశిష్టాద్వైత ప్రేతమునకు వాహకులుగా నుండఁదగరు. శైవులను స్మార్తులంటకూడదు. ఇట్టి కట్టుబాటువలనను ప్రయోజనము లేకపోలేదు. ఆయా శాఖలవారియందైకమత్యము వృద్ధియై, కష్టసుఖములకొకరికొకరగుచుందురు. కావుననే కొద్దికాలము క్రిందటి వరకు నొక్కయూరనెవ్వరయిన చనిపోయిన, కులమువారేవానికి దహనాదికములు జరిగించుచుండిరి. ఇప్పటికిని ఆ పద్ధతియే జరుగుచున్నది. మధ్వులు, వైష్ణవులు, లైంగ్యులు, లోనగువారు తమలో నొక్కఁడు మృతినొందిన మిగతవారందఱు సభ మూనించుకొని శవము ఇంటనుండి కదలుమార్గము నాలోచించుచుండిరి. పూర్వము డబ్బునిచ్చి వాహకవృత్తిగా జీవించువారివలన మోయించువాడుకయున్నట్టు కన్పడదు. నాగరికత వృద్ధిజెంది, వేషభాషలెక్కువయైన పట్టణములలో తప్ప డబ్బునిచ్చి మోయించువాడుక పల్లెలయందు లేదు. పల్లెలలోనివారికి పట్టణవాసపు పవాలో ఏమలవడక విపత్తులోనున్నవారిని కాపాడవలసిన యావశ్యకము లేదను బ్రహ్మవిద్య పట్టుపడనందున వారింకను ఆపత్కాలమున నొకరికొకరు సహాయులగుచున్నారు. పట్టణములలోని నాగరికత పల్లెలయందుకూడ చేరి ధనమునిచ్చి శవముల మోయించు వాడుక యచ్చట చేరకుండునట్లు భగవంతుఁడనుగ్రహించుచుగాత!

ఏ బ్రాహ్మణుఁడుగాని తాను శిష్యులకధ్యయనము జెప్పుచున్నప్పుడు, వీధిని బ్రాహ్మణప్రేతము పోవుచుండిన తత్క్షణమధ్యయనమును కట్టిపెట్టి శిష్యసహితముగా ప్రేతము వెంట ప్రేతభూమివరకుఁబోయి దహనాదికములగువరకు నుండవలసినదని మనుస్మృతియందు విధింపబడియున్నది. బ్రాహ్మణులమై పుట్టినను వేదాధ్యయనములు మన తాతముత్తాతలనాటనుండియు లేనందుననే కాబోలు మనవారెవ్వరును ప్రేతము వెంటబోకున్నారు. శిష్యులకు వేదమును చెప్పువారినికూడ ప్రేతమును జూడగానే

వెంటబోవ్వుని స్మృతి విధించుచున్నది. మనము వేదాభ్యాసము చేయుట లేదను మిష మీద మానుట యుచితము గాదు. అట్లు ప్రేతముతో బోవ్వుటకు విధియొక్క యుద్దేశమును కొంచెము యాలోచింతము. మనము వీధిలో నరుగుపై కూర్చున్నప్పుడుగాని మనయింటికొకరు మనమిత్రము వచ్చినయెడలగాని వారలను నాలుగడుగులు సాగనంపుట యాచారము. గ్రామాంతరము బోవుచున్నప్పుడు చుట్టములు స్నేహితులును యూరివెలుపలవరకునువచ్చి తమ ప్రేమను కనుపరచి వదలి వెళ్లలేనివారివలె విచారించుచు బోవుదురు. నిత్యకృత్యములలో నిట్లుండగా, తమ్మందరిని జీవించియున్నంతకాలము బొందెలోని ప్రాణమువలె నెడబాయకుండి, అనేక వ్యాపారములయందు సంబంధముండి, ఒకరి మంచిచెడ్డలకు మరియొకరుతోడై, సజాతీయుండై యున్న నరుండీలోకమునువదలి లోకాంతరమున కేగుచున్నప్పుడాతని తమకగోచరుండగుచున్నంతవరకు వదలివెళ్లలేక వేలలగు మనపూర్వులు ప్రేతములవెంట రుద్రభూమివరకుబోయి తమకు బంధుగుండును, మిత్రుండును, తోడునీడయునైయుండు మృతునియందనురాగముచే నాతండీమానవదేహమునువదలి సర్వమును భరించు భూమిలో లీనమగునంతదాక వేచుచుండిరి. మనమో పుట్టిననాటనుండియు స్వప్రయోజనపరులమైయుండి, మనకులాభించుపని యుండినమాత్రమితరులతో కలియుచు, ప్రతివ్యవహారమును గుప్తముగా కావించుచు, ఆలుబిడ్డల పోషణమే ఘనకార్యముగ నెంచుచుండుటచే, జనవిరోధియగు నుద్యోగియుండు స్థలాంతరమునకు మార్పబడినప్పుడు నెత్తిని గుడ్డమవైచుకొని గ్రుడ్డునీళ్లు గ్రుక్కుచు నొంటరిగా బోయినట్లు, చిన్నతనమునుండియు తన సంపాదనమును తినిన పుత్రుండును, పుత్రహీనుండైనచో నొక కర్వ్యనయు, వాహకులతో మాత్రము వల్లకాటిని చేరుచున్నారు. ప్రేతమువెంట రుద్రభూమివరకు బోవుట వేడుకవ్యాపారము కాదు. అయ్యది మృత్యునియెడల మనకుగల యనురాగమును, దయాస్వభావమును, తెలియచేయును. తన కొమారుండు గ్రామాంతరముపోయి వచ్చునప్పుడు తండ్రి తాను మరల నెన్నిదినములకు చూడగల్గునో యను తలంపుతో పుత్రునివదలక ముద్దులాడి, వద్దనుంచుకొని లేనివ్యవహారములకల్పించి మాటాడుచు నూరివెలుపలవరకు సాగనంపి దృష్టిపథమున పడుచున్నంతవరకు వెనుకతిరిగి జూచుచుండగా, ఎప్పటికిని మనల విడనాడి, లక్షల కొలంది ధనము వెచ్చించి మనమెంతయు ప్రయత్నముచేసినను మరల రప్పించుటకు దుర్లభమైన మృత్యుముఖమునం బ్రవేశించిన వారినాక్షణమున మరచిపోవుటకన్న క్రౌర్యమెక్కుడిగలదా? కావుననే తొలుతనుండియు, శవమువెంట కులమువారు బంధుగులుపోవు నాచారమేర్పడి, వైష్ణవులు శైంగ్యులు, శూద్రులు పురాతనమైన

విజయ - మార్గశిరము - విషయసూచిక సంపుటము - 3
సంచిక - 6

1. ఆంధ్రప్రాంతీయ రంజనీ సమాజము — 249 - 250
2. వివిధ విషయములు — 250 - 252
3. శరణాగతము — 253 - 360

యీనసదాచారమును నిల్పుకొనివచ్చుచున్నారు. వేదశాస్త్రములకు పుట్టినిల్లైలౌకిక వైదికవ్యవహారదక్షులై యొకప్పుడు నాగరికులైన యద్వైతులుమాత్రము నేటికాలమున కఠినచిత్తులై సంచరించుచున్నారు. కర్మములలో నెక్కువకర్మము గృహయజమానుని మరణమని తొలుతనే వ్రాసియుంటిని. ఇంటచూచెదు దిక్కులేక మగడు పోయి, విచారసముద్రమున మునిగియుండగా, కడుపుతరుగుకొనిపోవులాగు బిడ్డలు చుట్టును చేరి యేడ్చుచుండగా, పిలిచిన పలుకువారు లేక ప్రేతమువంకజూచిన గుండెలు వ్రక్కలగుచుండగా, అంతకు గడియక్రిందట నెక్కడజూచినను జనముతోడ కిటకిటలాడుచున్న యిల్లు నిర్జనముకాగా ప్రేతమింటనుండి కదలు సాధనమాలోచించువారు లేక భార్య పరితపించుచుండగా, స్నేహితులను చుట్టములని బ్రతికియున్నంతకాలము కుక్కలవలె చుట్టుతిరిగినవారు మబ్బులోని చుక్కలవలె నదృశ్యులుకాగా, దుర్భరవైధవ్యదశ సంప్రాప్తమై వేదనాదూయమానయగు విగతభర్తృకయొక్కదశ నేమని వర్ణింపవచ్చును! అట్టిసమయములయందే వెన్నవంటి హృదయముగలవారని లోకులెల్లరను ఘంటాపథముగా బలుకువారి హృదయములు శిలాకఠినములగుచుండుట సంభవించుచున్నది. తమవీధిని పీనుగయుండిన భోజనము చేయకూడదను పట్టింపుచేకొందరును, ఏకవీధిని కాపురము చేయుచుండగా శవమును కదలించుమార్గము నాలోచింపకుండిన తమకపఖ్యాతియని కొందరును దయాసముద్రులు నెదురింటి యరుగుమైగాని నడివీధినిగాని నిలిచి వాహకులకు వర్తమానమునంపుదురు. అప్పుడు వారల వెదుకబోయి యెక్కడను గానరాక తుదకేమూది లంజముండయింటిలోనుండియో తాంబూలమును నములుచు ప్రత్యక్ష రాక్షసునివలె భీకరరూపముతో వాహకుడు ప్రసన్నుడుకాగా వానికాయుదంతమును చెప్పవలసివచ్చును. వాడు నిజముగా విచారపడుచున్నవానివలె నా వార్త వినినతోడనే "అయ్యో యెంతపనిజరిగినది. పాపము బహుచెడ్డపని జరిగినది. నన్నుయిప్పుడేమి చేయమనెద"రని అడుగును. సమస్తము నీతోడనున్నది. నీవు రానియెడల నేపనియు జరుగదు. అందరు నీకొరకు కనిపెట్టియున్నారని చెప్పుదురు. నా అభ్యంతరమేమియున్నది. మీసెలవునకు బద్ధుడనే; రెండవమాజతకాడు తూర్పువీధిని బందరువారింటనుండాడు వాడు రాకుండనే నొంటరిగా నేపనియు జరిగింపలేను. వానికొరకుపోయి నేను చెప్పినానని చెప్పి తీసికొనిరండి. నేనీనడుమ మనవారింటికడకు పోయి ప్రయత్నముల చేయించుచుందునని మొదటివాహకుడు చెప్పి విచారరంగమునకువిజయము చేయును. అతడు రావేగమే పరమాప్తులు స్నేహితులు, ప్రాణపదమైన

మిత్రులను లేచి పీనుగుల పేరయ్యగారిని లజ్జావిహీనులై సత్కరించి పేరయ్యా! సమయమువచ్చినది త్వరగా తెమల్చవలెను. శవవాహకులకు దాటునుపాయము నాలోచింపవలయును. వెనుక నీవున్నావు మేమున్నామని పల్కిరి. బాబు మీరింతగా చెప్పవలెనా మీమాట నానెత్తిమాట. ఇదిగో క్షణములో జాగ్రత పెట్టుకునని చెప్పి రెండుగడక కఱ్ఱలు ఒకకుండ, కొంచెము చొప్పతాడు కొన్ని పిడకలు ఒక క్రొత్తగుడ్డ చిన్న గంధపుచెక్కను తెప్పింపుడని కావలసిన పరికరముల కాజ్ఞాపించి వానిని చాకలివాఁడు తెచ్చినవెనుక వాహనమును సిద్ధముచేయుచుండగా రెండవ కొమ్ముకాయుటకు మల్లయ్యగారు విజయముచేసి, ఆవల తొందరపనిలోనుండియు నీవు కబురుపంపితివని తెలిసి ఆపని వదిలివచ్చితిని. నన్ను త్వరగా పంపివేయవలెను. ఆపని తొందరపని యొట్టిదో మీరు గ్రహించియేయుందురు. రసికాగ్రగణ్యులైన వర్తకులు, ధర్మోపదేశముల వార్తాపత్రికలలోను సభలలోను జేయు న్యాయవాదులు, పైకి బిళ్లగోచులను జారుముడులను వేసి తిరుగుచు తమరినే నమ్మి యన్యపురుషునివంక కన్నెత్తియైన జూడక తమకొరకు పడిచచ్చుచున్నదనుకొను గృహస్థులును, అంధులవలె, నే వారకాంతవాగురులలో దగులుకొనియుండిరో యట్టి చకోరాక్షి శయ్యను వదలివచ్చుటయేతప్ప వేరొండు తొందరపని వెదకినను లేదని నమ్ముడు. అట్టి పావనదేహుండను మన పేరయ్యగారి సదుద్బోధనవల్ల నదివరకే పరిపక్వమనస్కుఁడై యుండుటవలన పిలువనంపిన కార్యము గడపలో సిద్ధముగుచున్నను వారినిచూడగానే తెలిసికొని, యిప్పుడుపని, గిరాకీదినములు, మీరు నాకు పది రూపాయిలనిచ్చినగాని నేను కొమ్మును కాయననుచు. అదియేమి పేరయ్యా అతఁడంత దారుణముగా నడుచుచున్నాడనిన నేకనుకొందునని చెప్పి, ఏమిరాయిది మనకు విధాయకమైన స్థలము నీవలాగు అడుగకూడదు అనిచెప్పగా మల్లయ్య అందులకు కినిసి నీవు వేయిచెప్పుము లక్షచెప్పుము ఇదులో నీవుచెప్పినట్టువినను కావలసిన రొకడల వీరికింకొకమాటు సదుపాయము చేసెదనని నిశ్శంకముగా బలుకును. తుదకు పుస్తెలనో పూసలనో అమ్మి వెంకటేశ్వరులముడుపును చెల్లించినట్లు వారలకట్నము చెల్లించకతప్పదు. ఇంతవరకు నాశ్చర్యముతో ప్రతివారును వీరలతగవుల చూచుచుండుటయేకాని మన కులమువాడుగదా యీతనిదేహము నీ ప్రత్యక్షరాక్షసులచే మోయించుటకు మనము సహించుటకంటె మనమేల దహనభూమికి మోసికొని పోగూడదను తలంపు ఒక్కరిమనస్సులోను పుట్టినపాపమునబోదు. అహా! కాలమహిమ నేమని చెప్పవచ్చును?

304 (సశేషము.) దుగ్గిరాల-సూర్యప్రకాశరావు.

శవవహనము (౩౦౪ - వుట శేషము.)

సమస్త బంధువులును మిత్రవర్గమునుగలవారల దుర్గతియే యీపగిదినుండగా దిక్కులేనిచావు వచ్చినవారిని, దూరదేశమందు చనిపోయినవారిని, వైద్యశాలలలో చనిపోయినవారినిగురించి మనము చెప్పనక్కరయే లేదు. కన్నతల్లిగర్భంగుండగా పినతల్లికి పిండప్రదానములు చేయువత్తురా. వాహకుల దౌష్ట్యము, కులమువారి కాఠిన్యముచూడగా కనికరలేశమున్నవారి మనసు నీరుగాకుండునా! మనయందు కొంచెమైనను జాత్యభిమానములుండినయెడల వైద్యశాలలు లోనగుచోట్ల దిక్కుమాలిన చావుచచ్చినవారు మాలమాదిగలచే నీడ్వఁబడుగతి యేలపట్టును! ఒక్క తురకగాని, క్రీస్తువుగాని అట్టి వైద్యశాలలో చనిపోవుట సంభవించిన పట్టణములో నున్న క్రైస్తవులందరును తురకలందరును జేరి తమ జాతివాని నితరులనంటనిత్తురా? కులాభిమానములేని విప్రులము మనము సహించియున్నారముగాని బ్రాహ్మణేతరుఁ డెవ్వఁడు సైపఁగల్గును? అనాథప్రేత సంస్కారమువలన కోటి యజ్ఞముల ఫలము లభించునని చెప్పఁబడినను, యజ్ఞఫలమందు మనకు నమ్మకములేనందున అనాథప్రేత సంస్కారమువలనగూడ ప్రయోజనములేదని మనసుసరిపెట్టుకొనవచ్చును. కలియుగమున ప్రజలు వివిధకర్మల నాచరించుటకు స్మృతిని రచించిన పరాశరుఁడు తన స్మృతియందీవిధముగా వ్రాయుచున్నాఁడు.

శ్లో॥ అనాథం బ్రాహ్మణం ప్రేతం యేవహంతి ద్విజాయతః
పదేపదే యజ్ఞఫలమానుపూర్వ్యాల్లభంతితే॥

బ్రాహ్మణులు దిక్కుమాలిన బ్రాహ్మణుని శవము మోచుచు నడచిన యడుగడుగున యజ్ఞఫలముంబొందుదురు.

శ్లో॥ నతేషామశుభం కించిత్పాపంవా శుభకర్మణామ్॥

ఈమంచిపనిచేసినవారికి కీడుగాని పాపముగాని లేదు.

శ్లో॥ అసగోత్రమబంధుంచ ప్రేతభూతం ద్విజోత్తమమ్।
వహిత్వాచ దహిత్వాచ ప్రాణాయామేన శుద్ధ్యతి॥

జ్ఞాతులు చుట్టములులేని బ్రాహ్మణుని శవమును మోచి దహనముచేసినవారు ప్రాణాయామంబున శుద్ధులగుదురు.

శ్లో॥ అనుగమ్యేచ్ఛయాప్రేతం జ్ఞాతిమజ్ఞాతిమేవహా
స్నాత్వాసచేలంస్పృష్ట్వాగ్నిం ఘృతంప్రాశ్య విశుద్ధ్యతి॥

చుట్టమునైన, చుట్టముకానివానినైన, చనిపోయినవానిని తీసికొని పోవునపుడుకూడ వెడలినవారు బట్టలతో స్నానముచేసి యగ్నిని స్పృశించి ఘృతప్రాశనము చేసి శుద్ధినొందును.

ప్రేతముతోఁ గూడ దహనభూమివరకుఁ బోవునని, శవమును కులమువారు మోయ వలెనని పరాశరుఁడు వ్రాసిన దానిని మనమెల్లర మామోదించి యట్లు గావించుట యాలోచనీయమైన విషయము. శవవహన శవదహనము లెట్లు జరుగుచున్నవో సంక్షేపముగాఁ జెప్పియుంటిని. తదనంతర రోదంతమును క్లుప్తముగా వ్రాసెదను. శవమింటనుండి కదలు సమయమున వీథిని వెదకినను మందునకైనను కానరాని బ్రాహ్మణోత్తములు దహనసమాప్తినై దహనజనిత తాపోపశమనార్థము చేయు మృత్తికా స్నానములకడ దబ్బులపంచుకొనుటకు కాకులవలె మూగుదురు. దురాన్న దుర్దానములకు లోనయి యెట్టి పాడుపనులకైన ఒడిగట్టువారల దూషించుటకన్న వారల దుష్పథములనుండి మరలించుటకు తగిన సాధనముల నాలోచించుటకు మనకు కర్తవ్యమని నమ్ముఁడు. రెండవనాటనుండియు నిత్యవిధులు దానములు దినవారములు జరిగించుటకు సలహాలు చెప్పువారును కష్టసుఖసరంజాములు జాగ్రతపెట్టువారికే కలవుండును. ఆవశ్యకమైన సమయమునకొక్కరును కారుగాని ఆ నిమిషము దాటినవెనుక నందఱును పరమాప్తులై పూసలలోని దారములవలె మెలగుచుందురు.

ఆంధ్రదేశీయులగు అద్వైతులారా! పశ్చిమతీరమున నొక్క మాల సాధారణ కుటుంబమునఁ బుట్టి తన ముప్పది రెండవయేటికి భారతఖండమంతటను వ్యాపించిన యుత్తమ మతమును స్థాపించి, వేదశాస్త్రములకు భాష్యములు వ్రాసి, సర్వమత ఖండనము గావించి, మతోద్ధారకాద్యనేక బిరుదాభిధానాలంకృతుఁడైన యాదిమ శంకరుని మతావలంబకులైయుండియు, నా మహామహుని కపకీర్తి దెచ్చుచుంటిరే! ఆతఁడు బోధించిన ధర్మములలో దయాసత్యశౌచములే గదా ప్రధానములు. అవి మీయందెంతవరకున్నవో యూహింపుఁడు. మీకొమారునకుద్యోగము చెప్పించిన వానికి, మానపుమడలి నీయనకు పాదసేవ చేసినాఁడను నభిమానము చేకనఁబరచు దయకు అర్థము లేదు. ఇబ్బందిలో నున్నవారియెడల కనికరముండి వారిని కనిపెట్టుటయేగదా దయ! మనుజునకు తనయిరుగుపొరుగువారితో సఖ్యముగానుండి వారలకు తోడ్పడి తాను సమర్థుఁడైనచో గ్రామములోనివారికిని, అంతకంటె ప్రజ్ఞావంతుఁడైనచో మండలములోనివారికిని, పూర్ణప్రయోజకుఁడైనచో దేశమునకంతకునుపయోగకారి యగుట సంభావనీయము. ఈకాలమున నిరుగుపొరుగులవారికిని స్వగ్రామములోని వారికిఁ గష్టసుఖములకు తోడ్పడక దేశోపయుక్తములగు కార్యములని అధికారమదాంధులు, స్వప్రయోజనపరులును చెప్పు కార్యములకు ధనమును కాలమును వినియోగపరుచుట పద్ధతియైయున్నది. హిందూదేశమునకంతకు నేకమతము నేర్పరుతమని, యేకభాషయుండవలెనని, యేకవేషముండవలెనని ప్రయత్నములు చేయువారునున్నారు.

ఇంటగెలిచిరచ్చగెలువవలెనుగదా! ఇంటభార్యబిడ్డలకు కడుపునిండకూడుపెట్ట లేకుండియు, ఛత్రము నిల్పవలెనను నభిలాషయుండుట యెట్టిదో? స్వవిషయములమాట మరచి దేశమున కంతకును మహోపకారులమగుదుమని తలచుట పట్టి దుర్భ్రమ. మనకిష్టులును, సమీపగులునగు వారును మనమును సుఖముగ జంపుటకు తగినవెలవు నాలోచించి పెనుక గొప్ప పోకిళ్లకు పోవుటమంచిది. ఉట్టికెగరలేనియమ్మ స్వర్గమున కెక్కఁగల్గునా? మన మతస్థాపకుఁడైన యాదిమ శంకరుఁడు తన తండ్రిదహనముకొరకు పలుకష్టములపాలై వాహకులు దొరకక యింటిపెరటిలో నాకమూల శవమునుదహనము చేయవలసివచ్చినందునకు, మనమాతమతావలంబకులమగుటను మనకు నాపాట్లే సంభవించినట్లు దోచుచున్నది. లేకుండిన విద్యాధికులై, యుచితవ్యాపారముల మెలంగుచు, ధరాధర్మములయిన కార్యముల నిర్వహించుచు, ప్రజాక్షేమాకాంక్షులై యొప్పుచున్న మీమనసులు శిలాసదృశములై మీరాపద్బాంధవాభిధానానర్హులైయుండుటకు కారణానంతరము నెద్దాని నారోపింపఁగలము! క్షత్రియులు, గ్రామములలోని వైశ్యులు, శూద్రులు, నాయుడులు, సాతానులు, లింగధారులు, చాకలులు, యీడిగలు, హీనజాతులవాండ్రగు చండాలులు తమ ప్రేతముల నితరుల నంటనీక అన్నివేళలను తమలో తాము మోసికొనిపోయి కులాభిమానమును లోకమునకు చాటుకొనుచుండఁగా, అద్వైతులును, కొంతవరకు మధ్వులును, ధనికులగు కోమటులుమాత్రము దాక్షిణ్యలవములేక పాపస్వరూపులగు వాహకులచే మోయించుటకు సమ్మతించుచున్నారు. హీనజాతులవారికన్న మనము నికృష్టదశలోనికివచ్చినారమే! మనపూర్వులయందున్న సద్గుణసంపద యెందుబోయెనో? లోకములోఁగల యెల్లజాతులవారికన్నను బంధుప్రేమయందును పరోపకారచింతనమందును హిందువులెక్కుడువారను విషయము నిర్వివాదాంశము. అట్టి హిందువులలో బ్రాహ్మణులు తమ విద్యాధిక్యముచే తక్కినజాతులకన్నిటికిని గురువులైయుండి, తమ యుపదేశములను తమ శాసనములనందఱును శిరసావహించి నడచుకొనుచుండఁగా, శాసనికులే తమ నిబంధనల జవదాటి ప్రవర్తించుట యాక్షేపణీయము. కావున మనమట్టి నిందను దొలగించుకొనుటకు యత్నింతము.

పల్లెలమాటవిడిచిపెట్టి వాహకులకొరకు విస్తారముశ్రమకు లోనగుచున్న పట్టణములలో మనమే సాధనముల నాలోచించి యవలంబించిన కృతార్థులమగుదుము. శవవహనము దోషముకాదని, దానికి మనము సమకట్టవచ్చునని మనలోకొందరు నిశ్చితాభిప్రాయులమైనను, వ్యాపారాంతములలో నున్నవారమగుటచే, ప్రతివారును మనము మొప్పుకాయుటకు సిద్ధముగనుండఁజాలము. ఒకటి రెండు విషయము

లలో వాహకులకు మనమడ్డమై మోసినను, మూతవదూరి వాని యవసరము రాక తప్పదు. అప్పుడు వారు విధించు నపరాధమును పైసలతోఁ గూడ చెల్లగట్టవలెను. ఇప్పుడు శవమును మోసికొనిపోవుటకు కట్టు, ఏడుకట్ల సవారినిచూచి నంతనే యసహ్యముగనుండును; అట్టి వాహనముపై ప్రేతమునుంచుటబట్టియే ప్రేతమన్న చాలమందికి భయము కలుగుచున్నది. తలప్రేలాడుచు, క్రిందిభాగము స్పష్టముగ కనఁబడుచు, బిగించికట్టినకట్లు వదిలిపోయి ప్రేత మొకవంకకు కదిలిపోగా, సవారిని క్రిందకుదించి, తిరిగి బిగియకట్టుచు, చావన్న గుండెబద్దలగునట్లు చేయుదురు. దొరల లోను, కొంతవరకు తురకలలోను, వహనవిధానము మనము మోదించఁదగియున్నది. విధాయకులమై, మన తల్లిదండ్రులకు బంధువులకు మనము జరుపు సత్కారముకన్న, ఆసుపత్రులలో దిక్కుమాలిన చావువచ్చినవారిని, మాలమాదిగలు మోసికొని పోవునప్పుడు, శవము కనఁబడకుండ, చాపలలో కట్టిపెట్టిగాని, లేక నులక మంచములపై పరుండబెట్టికాని మోసికొనిపోదురు. ఈ విషయమున, నా యభిప్రాయము మీకంగీకారమయినచో సులభమార్గము నొక్కదానిని వివరించెదను. మంచిబండిని యొద్దనుకొని, దానినడపుటకు బ్రాహ్మణునొక్కని నియమించి, బీద సాదలనక యందరివల్లను ప్రేతమునకు రు ౧ల చొప్పున వసూలుచేసి, దానిలో కొంత బ్రాహ్మణునకు మాసవేతనముగా నిచ్చుచువచ్చి, యింతటినుండియు మన మందరమును పనుల నిరువదులనిచ్చి, వికృతాకారముగనుండెడి ఏడుకట్లసవారిపై మోయించు వాడుకను మాన్పించుటకు ప్రతిజ్ఞచేయవలెను. దీనివలన కులహాని మానహాని రాబోదు. పూర్వముకన్న గౌరవము హెచ్చుగానుండును. పైచొప్పున జమచేసిన ధనములో మిగిలియున్నదానిని నిరాధార కుటుంబములకు సాహాయ్యము చేయుట కుపయోగించవచ్చును. ఈపద్ధతి కంగీకరించిరేని, ప్రస్తుతము పలుబీద కుటుంబములలో వహనదహనములకయ్యెడు వ్యయముతో పదిదినములకర్మను జరుపు కొనుటకు సదుపాయముగనుండును. ముందు కొన్నిదినము లీయాచారము క్రొత్తగా నున్నను, శీఘ్రకాలములో దాని లాభమును పూర్ణముగా గ్రహింపఁగల్గుదురు. మన ముపక్రమించినవెనుక మనలనుజూచి క్రమముగా కోమట్లు మొదలయినవారుకూడ నీపద్ధతి నవలంబించుటనిజము. ఈపద్ధతి యవలంబనీయమని పలువురిదివరకు నాతో చెప్పియున్నారు. కావున దీనినిగురించి మీరందఱు చక్కగా నాలోచించి, మనలోఁ గల గొప్ప లోపమును, తొలగింపఁ బ్రయత్నింతురని నమ్ముచున్నాను.

---

360 (శేషము) దుగ్గిరాల-సూర్యప్రకాశరావు.